ఈవీఎం తెలుసు..!



ఓటింగ్ లెక్క పక్కా..

- చెల్లని ఓట్లకు చెక్ పెట్టేలా రూపకల్పన
- ఒక్కో దానిపై 16 వరకు గుర్తులు
- చివరి బటన్‌గా నోటా ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: శాసన సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృతి చేస్తోంది. ఓటింగ్‌లో కచ్చితత్వానికి వినియోగిస్తున్న వీవీ ప్యాట్‌లపైనా వివరిస్తోంది. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెల్లని ఓట్లకు చెక్ పడింది.

ఎప్పటికప్పుడు ఓట్ల వివరాలు..

కంట్రోలింగ్ యూనిట్‌లో ఎరుపు రంగులో దీర్ఘచతురస్రాకారంలో ఉన్న భాగం డిస్‌ప్లే. ఈ ప్రాంతంలో ఎంత మంది ఓట్లు వేసింది ఎప్పటికప్పుడు చూపిస్తుంది. దిగువన నీలి రంగులో చతురస్రాకార భాగాలున్న ప్రాంతాన్ని క్యాండ్‌సెట్ యూనిట్‌గా వ్యవహరిస్తారు. వీటిని రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోలింగ్‌కు ముందు సెట్ చేసి ఉపయోగిస్తారు.

సీయూ, బీయూ ధ్రువీకరణ..

సీయూ, బీయూల వెనుక వైపున పరిశీలిస్తే ఈవీఎం యంత్రాలు క్యూసీ క్వాలిటీ చెక్ జరిగింది లేనిది తెలుసుకోవచ్చు. వెనుక భాగంలో అంటించి ఉండే స్టిక్కర్‌పై ఈవీఎం తయారీ సంస్థ ఈసీఎల్ ప్రతినిధి, జిల్లా ఎన్నికల అధికారి ఈవీఎంల పనితీరు, క్వాలిటీని ధ్రువీకరిస్తూ సంతకాలు చేసి ఉంటాయి.

పని విధానం ఇలా..

ఈవీఎంలకు రెండు యంత్రాలు అనుసంధానంగా ఉంటాయి. అందులో కంట్రోల్ యూనిట్(సీయూ), బ్యాలెట్ యూనిట్(బీయూ) కీలకమైనవి. ఎన్నికల కేంద్రంలోని అధికారుల వద్ద సీయూ ఉంటుండగా.. ఓటర్లు బీయూలో ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రతీ ఓటరు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు అధికారి సీయూలోని బ్యాలెట్ బటన్‌ను నొక్కితే ఓటరు వద్ద ఉన్న బ్యాలెట్ యూనిట్ ద్వారా ఓటు వేసేందుకు వీలవుతుంది. బీయూలో 16 గుర్తుల వరకు ఉంటాయి. ఒక వేళ అంతకంటే ఎక్కువ గుర్తులు ఉంటే మరో యంత్రాన్ని వినియోగిస్తారు. అభ్యర్థులు పది మంది కంటే తక్కువగా ఉంటే పోటీలో ఉన్న అభ్యర్థులు మేరకు గుర్తులు మాత్రమే ఉండేలా సాంకేతిక చర్యలు తీసుకుంటారు. ఎన్నికల అధికారి సీయూలో బ్యాలెట్ బటన్ నొక్కగానే ఓటు వేసేందుకు వెళ్లిన ఓటరు వద్ద ఉన్న బీయూలోని బీజీ బల్బు వెలుగుతుంది. బీయూలోని అభ్యర్థుల గుర్తుల్లో తమకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బటన్‌ను నొక్కితే ఓటింగ్ పూర్తయినట్లు. ఎన్నిక పూర్తి కాగానే బీజీ బల్బు ఆగిపోతుంది. అప్పుడు మరో ఓటరును పంపించి ఎన్నికల అధికారి బ్యాలెట్ బటన్‌ను నొక్కుతారు. ఇలా మరోకరు ఓటు వేసేందుకు వీలవుతుంది. బీయూలో అభ్యర్థులందరి గుర్తుల తర్వాత నోటా గుర్తుతో బటన్‌ను ఏర్పాటు చేస్తారు. పైవారిలో ఎవరూ కాదు అనే అంశంతో ఉండే ఈ బటన్ అన్ని గుర్తుల తర్వాత ఉంటుంది. ఇక ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు నమోదైందో లేదో వీవీప్యాట్‌లో చూసుకునేలా ఓటు వేసే పరికరం పక్కనే అమర్చుతారు.

ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ఎక్కడకు వెళ్లారు?



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



ఖమ్మంమయూరిసెంటర్: ఓట్లు అభ్యర్థిస్తున్న పువ్వాడ సతీమణి వసంతలక్ష్మి

ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఎన్నికలు వచ్చే సరికి కొంత మంది వలస పక్షుల్లా ఖమ్మంపై వాలుతున్నారని, వారు ఇక్కడ ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రశ్నించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని 18, 26వ డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన రోడ్‌షో, 13 డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోవిడ్ సమయం, మున్నేరు వరదల సమయంలో తనపై పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తాను స్థానికుడిని కాబట్టే ఖమ్మం అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాల అమలు పట్ల ఆలోచన చేశానని అన్నారు. గతంలో పాలించిన వారికి అధికారం, పదవి పట్ల ఉన్న వ్యామోహం ప్రజల సమస్యలు, అభివృద్ధిపై లేదని అన్నారు. అలాగే నగరంలోని పార్శిబంధంలో దూదేకుల సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ.. దూదేకుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడింది మీ అజయ్ ఖాన్ మాత్రమే అని అన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చే నిధులతో నగర ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి, సంక్షేమంలో ఖమ్మాన్ని నంబర్ వన్‌గా నిలిపానని చెప్పారు. తుమ్మల తెలుగుదేశంలో మంత్రిగా, ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఖమ్మం ఎందుకు అభివృద్ధి చెందలేదు.. సత్తుపల్లిని అభివృద్ధి చేసుకున్నారు తప్పితే ఖమ్మంలో చేసింది ఏమైనా ఉందా అన్నారు. ఇంటిముందు అభివృద్ధి, కంటి ముందు అభ్యర్థి ఉన్నాడని, గమనించి వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వర రావు, కార్పొరేటర్లు ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, ప్రశాంత లక్ష్మి, కొత్తపల్లి నీరజ, వల్లభనేని రామారావు, దొడ్డ కోటేశ్వర రావు, అడపా వేంకటేశ్వర రావు, ఎంబీసీ రాష్ట్ర కో కన్వీనర్ షేక్ షకీన, దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సిద్దా సాహెబ్, నగర అధ్యక్షుడు ఉస్మాన్, ఎస్‌కె. యాకూబ్‌బాబా, తాజుద్దీన్, అమరగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ గెలుపును కోరుతూ..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి, మంత్రి వదిన, మమత విద్యాసంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, వారి కోడలు సాయి శిరిణి, 12వ డివిజన్ కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు గురువారం నగరంలోని పలు డివిజన్‌లలో ఇంటింటి తిరిగి కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.

రోజుకో పార్టీ మారే వారిని నమ్మొద్దు..



తిరుమలాయపాలెం: తిప్పారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న తమ్మినేని



నేలకొండపల్లి: తమ్మినేని ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

పాలేరు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: రోజుకో పార్టీ మారే వారిని నమ్మొద్దని, చట్ట సభలలో కమ్యూనిస్టులు ఉంటేనే పేదల బతుకులు భద్రంగా ఉంటాయని అందుకు ప్రజల కోసం పనిచేసే తనను అసెంబ్లీకి పంపించాలని పాలేరు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో దుమ్ముగూడెం సాధన కోసం 2,600 కిలోమీటర్లు పాదయాత్ర, దళితవాడల అభివృద్ధి కోసం సైకిల్ యాత్ర చేసినట్లు గుర్తు చేశారు. తెలిపారు. ఆశ, అంగన్‌వాడీ గ్రామ దీపిక, మిడ్ డే మిల్స్, గ్రామ పంచాయతీ వర్కర్ల కోసం నిరంతరం పోరాడానని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని, ప్రజా సమస్యలపై పోరాడిన సీపీఎంకు మాత్రమే ఉందని అన్నారు. అసెంబ్లీలో ప్రశ్నించే వారు లేకపోతే పాలకపార్టీలు ఇష్టారాజ్యంగా ప్రజల సంపదను రాబందుల్లా దోచుకుతింటారని ఎద్దేవా చేశారు. రంగులు మార్చే రాజకీయాలను ప్రజలు నమ్మరని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే ప్రజా గొంతుకను అసెంబ్లీకి పంపిస్తే, సమస్యలపై మరింత పోరాడతానని పేర్కొన్నారు. జిల్లాలో అనేక ప్రాజెక్టులను సాధించేందుకు పునాది రాయి వేసింది సీపీఎం అన్నారు. ఎత్తిన జెండా దించకుండా కడదాకా కష్ట జీవుల కోసం పోరాడుతున్న సుత్తి కొడవల్లి నక్షత్రం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత ఆయా గ్రామాల్లో తమ్మినేనికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, అంగిరేకుల నరసయ్య వీరన్న, దాసరి మహేందర్, నాగటి సురేశ్, కొత్త పెల్లి వెంకన్న, బండి రమేశ్, గుడవర్తి నాగేశ్వర రావు, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, వల్లూరిపల్లి లక్ష్మీనారాయణ, కట్టికోల వెంకన్న, మారుతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా నామస్మరణతో నగర సంకీర్తన

ఖమ్మంగాంధీచౌక్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 98వ జయంతి మహోత్సవ మహాయజ్ఞంలో భాగంగా గురువారం నగరంలోని శ్రీనివాసనగర్ శ్రీ సత్యసాయి మందిరంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన సుప్రభాతం, మహానగర సంకీర్తన, పల్లకి సేవ, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, వేద పఠనం, భజన, బర్త్ డే కేక్ కటింగ్, ఊంజల్ సేవ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. నగర సంకీర్తనను శ్రీనివాస్ నగర్ పురవీధుల్లో నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ ఎ.నర్సింహారావు, కార్యవర్గ సభ్యులు కె.నర్సింహామూర్తి, టి.సాయి సుధాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన, హామీల అమలులో మోసం

కామేపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసిందని ప్రభుత్వ పాలన, ఇచ్చిన హామీలు అమలు చేయక అన్ని వర్గాలను మోసం చేసిందని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అంతేకాక కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యం అందిందని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మకుండా హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ సుజాత, తోటకూరి శివయ్య, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, మేకల మల్లిబాబుయాదవ్, అప్పన పిచ్చయ్య, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, ఆరెం రవి, దేవండ్ల రామకృష్ణ, నల్ల మోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, మేకల మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

ఫ్లాగ్ డే ఫండ్ సేకరణ

ఖమ్మం స్పోర్ట్స్: ఆర్జేసీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యాన గురువారం నగరంలో ఫ్లాగ్ డే ఫండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ జి.కృష్ణ హాజరై మాట్లాడుతూ.. ఆర్మీ ఉద్యోగులకు ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులు సేకరించిన ఆర్మీ రిలీఫ్ ఫండ్‌ను ఆర్మీ కుటుంబాలకు అందజేయనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

నాసా కిట్లు అందజేత

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మమత రోడ్‌లో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా(నేషనల్ ఎయిరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)కు సంబంధించిన కిట్లను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, మహిళా డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్‌లు గురువారం విద్యార్థులకు అందించారు. వివిధ విభాగాల బాధ్యులు చేతన్ మాథుర్, కృష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్‌ఎన్ శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: యూసీ మాస్ అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హార్వెస్ట్ పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. గురువారం విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడుతూ..జూనియర్స్ విభాగంలో టి.నూర్‌దీప్ నందన్‌రెడ్డి(4వ తరగతి) చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా నిలిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా.. పలువురు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

'సర్వజ్ఞ'లో దంత వైద్యశిబిరం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో మమత దంత వైద్య కళాశాల దంత వైద్య బృందం ఆధ్వర్యాన గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ మాట్లాడుతూ.. దంతాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కాగా, ప్రొఫెసర్ అనిత, ప్రతాప్, కీర్తి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి..

కామేపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మర ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఊహించని అభివృద్ధి సాధించిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకట్లు కమ్ముకుంటాయని, ఆ పార్టీకి ఓటు వేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, బానోత్ రాములునాయక్, దొడ్డ మల్లేశ్, ఐతనబోయిన విఠల్, చల్లా నాగేంద్రబాబు, రమేశ్, శీలం పుల్లయ్య, వస్రాం, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హన్మంతరావు

ఓటుపై అవగాహన..



ఓట్ అక్షరమాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నేలకొండపల్లి: ఓటు విలువను తెలుసుకోవాలనే ఉద్దేశంతో మండలంలోని రాజేశ్వరపురం పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓట్ అనే అక్షర మాల రూపంలో కూర్చోగా.. పాఠశాల హెచ్‌ఎం పి.కృష్ణారావు మాట్లాడారు. ఓటు అనే వజ్రాయుధంతో ప్రజాస్వామ్యాన్ని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఉపేంద్రయ్యనగర్‌లో గల కవిత డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యాన కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లచే రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ.. యువత రక్తదానం ఇవ్వడంపై అవగాహన ఉండాలని, రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ పారుపల్లి ఉషాకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రాధాకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు జానిమియా, రాజేశ్, పవన్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వినూత్నకు నాట్యచంద్రిక బిరుదు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని జె.వినూత్న భరత నాట్యంలో ప్రతిభ కనబర్చినందుకుగాను నాట్యచంద్రిక బిరుదు లభించినట్లు పాఠశాల డైరెక్టర్లు నీలిమ, ఆర్‌వీ నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావులు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించాక మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిందన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ నీలిమ

యూబీఐ ఆధ్వర్యాన టాయిలెట్ నిర్మాణం

ఖమ్మంగాంధీచౌక్: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ) ఖమ్మం రీజనల్ కార్యాలయం ఆధ్వర్యాన సామాజిక సేవలో భాగంగా జిల్లాలోని చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బాలికల సౌకర్యార్థం టాయిలెట్ నిర్మాణం చేపట్టారు. కాగా, గురువారం బ్యాంకు రీజినల్ మేనేజర్ హన్మంతరెడ్డి దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజనల్ మేనేజర్ టీపీఎస్ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న హన్మంతరెడ్డి

దొర మాయమాటలకు మోసపోవద్దు..



ఖమ్మంరూరల్: బారుగూడెంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మంరూరల్: పొంగులేటికి మద్దతు తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

ఎన్నికల ప్రచారాల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణ గత తొమ్మిదన్నరేళ్లుగా ఓ దొర చేతిలో బందీ అయిందని, తెలంగాణ తెచ్చుకుంది అన్ని వర్గాల ప్రజానీకానికి మంచి జరిగేందుకని, కేసీఆర్ కుటుంబానికి మేలు జరగడానికి కాదని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఆ దొర ఫాంహౌస్ నుంచి బయటకు వస్తారని, ఆ తర్వాత సామాన్య ప్రజల కష్టాలు గాలికొదిలేస్తారని, కేసీఆర్ మాయమాటలకు లొంగిపోతే మళ్లీ గోసపాలవుతామని పేర్కొన్నారు. దోచుకొని దాచుకున్న సొమ్ముతో అక్కడ రేవంత్‌రెడ్డిని ఇక్కడ నన్ను ఓడించడానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. మీరు ఉన్నారనే ధైర్యంతోనే కేసీఆర్‌ను ఎండగడుతున్నానని చెప్పారు. ఎమ్మెల్యే ప్రజల కోసం బాధపడుతున్నట్లు కన్నీరు కార్చుతున్నారని, ఒక వ్యక్తి కన్నీరు పెడుతున్నాడని ఆలోచిస్తే రాబోయే ఐదు సంవత్సరాలు ప్రజలు ఆ కన్నీరు భరించాల్సి ఉంటుందని తెలిపారు. డబ్బు మదంతో అధికార దాహంతో విర్రవీగుతున్న ఆపధర్మ ప్రభుత్వానికి, ఇందిరమ్మ రాజ్యస్థాపనకు, ప్రజాపరిపాలన కోసం జరుగుతున్న ఈ ఎన్నికల యుద్ధంలో ప్రజలు భాగస్వాములై కాంగ్రెస్‌కు మద్దతు పలికి హస్తం గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌కు గట్టి బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గరికపాటి వెంకట్రావు, పల్లెర్ల పాండు, శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల మద్దతు..

మండలంలోని పెదతండాలో గల సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు పొంగులేటికి మద్దతు పలికారు. గురువారం జరిగిన విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి మాట్లాడాక ఆరేకోడుకు చెందిన గౌడ సంఘం నాయకుడు మార్కం లింగయ్య కుమార్తె వివాహానికి హాజరయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిక..

సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా.. ప్రసాద్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వజ్జా శ్రీనివాసరావు, హనిమిరెడ్డి, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జట్టు మల్లికార్జున్, కృష్ణారావు, కాంతేశ్వరరావు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గిరిజన తండాల అభివృద్ధి..



ఎదుళ్లచెరువు ప్రచారంలో మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి



బచ్చోడుతండాలో తన మనువడు దక్షుతో నృత్యం చేస్తున్న కందాళ

పాలేరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: నాడు వెనుకబడిన గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది అభివృద్ధికి బాటలు వేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని పాలేరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు. మాయ మాటలతో డబ్బులతో వస్తున్న కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే మహిళలకు రూ.3వేలు, సన్నబియ్యం, రైతులకు రైతుబంధు ద్వారా దశల వారీగా రూ.16వేలకు పెంపు, పింఛన్ల పెంపు, పేదలకు ఇళ్లు వస్తాయని అన్నారు. మండలంలోని బచ్చోడుతండాలో తన మనుమడు దక్షుతో కలిసి నృత్యం చేసి ప్రజలను ఆనంద పరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, సర్పంచ్‌లు భారతి, కొండబాల వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి ఉపసర్పంచ్ యమున మాజీ సర్పంచ్ నేరడి సత్యం నాయకులు శ్రీకాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా..

మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలులో గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గురువారం రాత్రి కందాళ ఉపేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనేపథ్యంలో తిరుమలాయపాలెంలో గజమాలతో సత్కరించారు. ప్రచారంలో ఎమ్మెల్సీ తాతా మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు